

సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

## వేతనాలు చెల్లించాలని
# అంగన్‌వాడీల ధర్నా

రంగారెడ్డి, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ) : పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశించామని, కానీ.. మూడు నెలలు అవుతున్నప్పటికీ జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. టీచర్లు ఆయాలు జీవనం కొనసాగించాలంటే చాలా ఇబ్బందిగా ఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలని, కనీస వేతనంగా రూ.26వేలు అందించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, యూనియన్ జిల్లా కార్యదర్శి కవిత, అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, సీఐటీయూ ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పోచమోని కృష్ణ, సీహెచ్ ఎల్లేష్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, జిల్లా నాయకులు వైదేవి, బేబీ బాలమణి, జయమ్మ, యాదమ్మ, లక్ష్మి, జ్యోతి, సుకన్యలతోపాటు 600 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఆలయ భూములను ఆక్రమిస్తే
# చట్టపరమైన చర్యలు

**- దేవాదాయ శాఖ డిప్యూటీ కలెక్టర్ అనిత**



హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

కడ్తాల్, ఫిబ్రవరి 20 : ఆలయ భూములను ఆక్రమించిన, వాటిలో అక్రమ నిర్మాణాలను చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ భూముల పరిరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అనిత అన్నారు. మండల కేంద్రంలో సర్వే నంబర్లు 125, 130లో లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన భూములకు సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించారు. ఈ మేరకు మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ తహసీల్దార్లు హరిత, విజయలక్ష్మి, ఈవోలు మోహన్‌రావు, స్నేహలత, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శాయిరెడ్డి, రాఘవేందర్, మల్లేశ్‌గౌడ్, బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- అభివృద్ధిపై మాట్లడకుండా గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తున్నది
- ఒక్క కొత్త ఉద్యోగమూ ఇవ్వకుండా నియామక పత్రాలతో ప్రచారాలు
- ఏనాడూ జై తెలంగాణ అనని వ్యక్తి సీఎం కావడం బాధాకరం
- తెలంగాణ ప్రజలపైకి తుపాకి చూపిన వ్యక్తి ఇప్పుడు సీఎం
- బూతులు, వ్యంగ్యంగా మాట్లాడటం తప్ప. రైతులపై సీఎంకు ప్రేమ లేదు
- కాంగ్రెస్, బీజేపీలు పాలమూరును మోసం చేశాయి
- మీకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ఒక్క ఫోన్ కొట్టండి
- బీఆర్‌ఎస్‌కు గెలుపు, ఓటములు కొత్త కాదు
- షాద్‌నగర్ బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నెలలు గడుస్తున్నా రైతు బంధు, రైతు రుణ మాఫీ, 4వేల పింఛన్లు లేవు

# హామీలపై నిలదీయండి..

## అబద్దాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

షాద్‌నగర్, ఫిబ్రవరి 20 : అబద్దాలను ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ కాలయాపన చేస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అధ్యక్షతన షాద్‌నగర్ పట్టణంలోని కుంట్లరాంరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా రైతు బంధు, రైతు రుణ మాఫీ, 4 వేల పింఛన్ల ఊసే లేదన్నారు. 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి గొప్పలకు పోతుందని మండిపడ్డారు. కరోనా కాలంలోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు నిధులు ఆపలేదన్నారు. ఏనాడూ జై తెలంగాణ అనని వ్యక్తి, ప్రస్తుతం సీఎం కావడం బాధాకరమన్నారు. బూతులు మాట్లాడుతూ వ్యంగ్య ప్రసంగాలు చేస్తూ కాలయాపన చేయడం తప్ప ప్రజలపై ప్రేమ లేదని మండిపడ్డారు. పాలమూరు ప్రాంతాన్ని కాంగ్రెస్, బీజేపీలు మోసం చేశాయని దుయ్యబట్టారు. పాలమూరు ప్రాజెక్టు పనులను 80 శాతం మేర బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నల్లగొండలో నిర్వహించిన కృష్ణా జలాల సభతో కాంగ్రెస్ ప్రభుత్వం భయపడి అసెంబ్లీలో ప్రాజెక్టుల అప్పగింతను వ్యతిరేకిస్తూ తీర్మానం ప్రవేశపెట్టిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు పని చేశారని, ఆ స్ఫూర్తితోనే కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామనే విషయాన్ని మర్చిపోవద్దని పార్టీ శ్రేణులకు సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీకి గెలుపు, ఓటములు సహజమని, ఎన్నడూ అధికారం కోసం పని చేయలేదన్నారు. అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డిలు తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేయాలని చూసినా వెనుకడుగు వేయలేదన్నారు. ఎవ్వరికి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని, ఒక్క ఫోన్‌తో గంట సమయంలో షాద్‌నగర్‌లో ఉంటానని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. తెలంగాణ పోరులో షాద్‌నగర్ ప్రాంత ప్రజల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై గ్రామీణ స్థాయిలో ఎక్కడిక్కడ ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఇప్పటి నుంచే బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, నేడు కాంగ్రెస్ చేస్తున్న పాలన తీరును పోల్చుతూ ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన దేశ మాజీ ప్రధాని, దివంగత నేత పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ పార్టీ కనీస గౌరవం ఇవ్వలేదని, మన తెలంగాణ రాష్ట్రంలో మన టీవీ పీవీ నర్సింహారావు శత జయంతి ఉత్సవాలను నిర్వహించడమే కాకుండా ఆయనకు భారత రత్న ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన గొప్ప ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని, అసెంబ్లీ తీర్మాన ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం పీవీ నర్సింహారావుకు భారత రత్న ఇవ్వడం సంతోషకరమన్నారు. తెలంగాణ ఉద్యమంతో సిరిపురం యాదయ్య పాత్ర వెలకట్టలేనిదని, ఆ నాడు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలంగాణ కోసం అమరుడయ్యారని గుర్తు చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమావేశానికి ముందు కళాకారుడు సాయిచంద్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. హరీశ్‌రావును పార్టీ నాయకులతో పాటు పలువురు సన్మానించారు.

ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, సి. లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్, జడ్పీ వైస్ చైర్మన్ ఈటె గణేశ్, ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్, నాయకులు ఎస్‌డీ ఇబ్రహీం, ఇంతీయాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రజినీసాయిచంద్, రాజావరప్రసాద్, రాజ్యలక్ష్మి, రాంబాల్‌నాయక్, రాములు, రాజేశ్‌పటేల్, మిట్టునాయక్, వంకాయల నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మీనర్సింహారెడ్డి, లక్ష్మణ్‌నాయక్, బుచ్చిగూడ వెంకట్‌రెడ్డి, అగ్గనూరు విశ్వం, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, దేవేందర్‌యాదవ్, యుగేందర్, ప్రతాప్‌రెడ్డి, శంకర్, రంగయ్య, ఆంజనేయులు, ఈశ్వర్‌రాజు, ఎజాజ్ అడ్డు, బాబాఖోరీ, మర్రిపల్లి నర్సింహ, యాదయ్య, నక్కల వెంకటేశ్‌గౌడ్, బక్కన్నయాదవ్, నర్సింగ రావు, డొలీ రవీందర్, సత్యనారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

### సమైక్య రాష్ట్రంలో డీజిల్ తో పరిశ్రమలు నడిచాయి..



**– మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి**

సమైఖ్య రాష్ట్రంలో డీజిల్ పోసి జనరేటర్లతో పరిశ్రమలను నడిపారు. కేసీఆర్ ప్రభుత్వంలోని నిరంతర కరెంట్‌తో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందింది. ప్రస్తుత ప్రభుత్వం రైతులను విస్మరిస్తున్నది.

### దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయి..



**– మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

కాంగ్రెస్ నాయకుల తీరు చూస్తే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఎట్లుండే.. కేసీఆర్ పాలనలో రైతులు ఎలా అభివృద్ధి చెందారో మనం చూశాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా రైతు బంధు, రైతు రుణమాఫీ, పింఛన్లు లేవు.

### ఎంపీ ఎన్నికల్లో సత్తాచాటాలి..



**– ఎమ్మెల్సీ వాణీదేవి**

రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ శ్రేణులమంతా కలిసికట్టుగా పని చేసి సత్తాను చాటుదాం. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు శత జయంతి ఉత్సవాలను జరిపించిన గొప్ప నాయకుడు కేసీఆర్.

### బీఆర్‌ఎస్ ప్రజల గుండెల్లో ఉన్నది..



**– మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల గుండెల్లో చెరుగని ముద్ర వేసుకున్నది. అబద్దాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి.

### కాంగ్రెస్‌కు ప్రాజెక్టులపై అవగాహన లేదు..



**– మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన లేదు. అర్ధరహిత ఆరోపణలు చేస్తున్నది. అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను మోసం చేయడం సరికాదు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు.



సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు




# జీతాల్లేవ్..

- రెండు నెలలుగా జీతాలులేక అవస్థలు
- జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- జిల్లావ్యాప్తంగా సుమారు 2 వేలకుపైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాని జీతాలు
- నిధులు లేక ప్రభుత్వాసుపత్రుల్లో నిలిచిన ఉచిత భోజనం
- గత మూడు నెలలుగా ఆగిన టీబీ రోగులకు ఇచ్చే ఆర్థిక సాయం

వికారాబాద్, ఫిబ్రవరి 20, (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు ఆగమయ్యాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి గెలిపిస్తే ఇబ్బందుల పాలు చేయడంపై జిల్లాలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలిచాలని జీతాలతో బతుకునీడుస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చే జీతాలు సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క శాఖనో కాకుండా అన్ని శాఖలకు సంబంధించిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు లేక చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. కుటుంబ పోషణతోపాటు తీసుకున్న ఇంటి సామగ్రి తదితరాలకు ఈఎంఐలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. మరికొందరు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గత రెండు, మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో అప్పులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న జీతాలతోపాటు ఇకపై ప్రతి నెలా సమయానికి జీతాలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటే సమయానికి జీతాలతోపాటు ఉద్యోగాలు రెగ్యులర్ అయ్యే అవకాశాలు ఉండేవని పేర్కొంటున్నారు.

**గత రెండు, మూడు నెలలుగా అందని జీతాలు..**

జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు లేక వెతలు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 2 వేలకుపైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత రెండు, మూడు నెలలుగా జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య శాఖకు సంబంధించి ఏఎన్‌ఎంలు మొదలుకొని ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, వైద్యులకు మూడు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న దాదాపు 200 మందికీ రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. వీరిలో ఆఫీస్ సబార్డినేట్లు మొదలుకొని కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలకు జీతాలు అందలేదు. విద్యా శాఖలో అత్యధికంగా 750 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు అందని పరిస్థితి నెలకొన్నది. వీరిలో టీచింగ్, నాన్–టీచింగ్ ఉద్యోగులు ఉన్నారు. విద్యా శాఖలో పని చేస్తున్న సీఆర్పీలు, ఎంఐసీలు, పీటీఐలతోపాటు కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు జీతాల కోసం విన్నవిస్తున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వమే నిధులు విడుదల చేయడంలేదని, దీంతో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార వర్గాలు తెలుపుతున్నాయి.

**ప్రభుత్వాసుపత్రుల్లో నిలిచిన ఉచిత భోజనం..**

పేద ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలన్నీ ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవమైతే కేసీఆర్ కిట్స్‌తోపాటు అందించిన ఆర్థిక సాయం మూడు నెలలుగా నిలిచిపోయింది. గర్భిణులకు సరైన పోషకాలు అందిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉంటారని గుర్తించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం గర్భిణులకు అందించిన న్యూట్రీషన్ కిట్స్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బంద్ అయ్యాయి. ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరీలు అయిన మహిళలకు ఆసుపత్రుల్లో ఉండే వారం, పది రోజులపాటు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం అందించేందుకుగాను నిధులిచ్చేది. గత మూడు నెలలుగా నిధులు రాకపోవడంతో ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత భోజనం బంద్ అయ్యింది. గత ప్రభుత్వం టీబీ రోగులకు ప్రతి నెలా రూ.500ల చొప్పున సాయం చేస్తూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి టీబీ రోగులకిచ్చే ఆర్థిక సాయం ఆగిపోయింది. దీంతో జిల్లాలోని 1600 మంది టీబీ వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

### జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం..



గత ఒక 5 నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. జీతాలు వస్తాయన్న నమ్మకంతో విధులకు హాజరవుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నాం. గత ఐదు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఆపసోపాలు పడుతున్నాం. ఇప్పటికైనా వైద్య సిబ్బందికి ఇవ్వాలి. మమ్మల్ని ప్రోత్సహిస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందిస్తాం. త్వరగా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని జీతాలను వేయాలని వేడుకొంటున్నా.

**– సంతోశ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్, పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం**

### టీఏలను ప్రభుత్వం ఆదుకోవాలి..



ఉపాధి హామీ పథకంలో టీఏలుగా పని చేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం ఆదుకోవాలి. మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబం గడువడం కష్టంగా ఉన్నది. తీసుకున్న సామగ్రి, లోన్‌ల ఈఎంఐలు నిలిచిపోయాయి. గత 2006 సంవత్సరం నుంచి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో టీఏగా పని చేస్తున్నా. గత ప్రభుత్వం పే స్కేలు ఇస్తామని హామీ ఇచ్చింది. అంతలోనే ఎన్నికల్లో ఓడిపోవడంతో ఇవ్వలేదు. ఇప్పటికైనా ఉపాధి హామీ టీఏలకు పే స్కేలు అమలు చేసి ఆదుకోవాలి.

**– శ్రీనివాస్, టీఏ ఉపాధి హామీ పథకం, ధారూరు మండలం**

## పాలనలో మార్పునకు
# కార్యాచరణ

- త్వరలోనే 200 యూనిట్ల కరెంటు, గ్యాస్ సిలిండర్ పథకాల అమలు
- వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు
- పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి, ఎంపీపీ, జడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రంగారెడ్డి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : పరిపాలనలో మార్పులు తీసుకొచ్చేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అనితా హరినాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, ఈర్లపలి శంకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ అనితా హరినాథ్ రెడ్డి, కలెక్టర్ శశాంక పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలకు ఇప్పటి వరకు రూ.15 కోట్ల జీరో టిక్కెట్లను అందించామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచామన్నారు. త్వరలోనే మహాలక్ష్మి పథకంలో భాగంగా 200 యూనిట్లు కరెంట్, గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు.

**తాగునీటి ఇబ్బందులు రావొద్దు..**

మిషన్ భగీరథపై జరిగిన చర్చ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ వేసవి సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా అధికారులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా, ఇంటింటికీ రక్షిత తాగునీటిని సరఫరా చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైనచోట పైప్ లైన్ లీకేజీల మరమ్మతుల వంటి ప్రతి అంశంపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ అనుమతితో బోర్లు వేసేందుకు అనుమతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.4.5 కోట్లతో కార్యాచరణను రూపొందించినట్లు మిషన్ భగీరథ అధికారులు మంత్రికి వివరించారు.

**విద్యా, వైద్యంపై చర్చ..**

విద్యాశాఖపై చర్చ సందర్భంగా సభ్యులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను ప్రస్తావించారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చేస్తామని, మార్చి 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డీఈవో సుశీందర్‌రావు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అన్ని రకాల వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్, సిబ్బంది లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, కచ్చితంగా డాక్టర్, సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు స్పందించి సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. జిల్లాలో బస్తీ దవాఖానల ద్వారా ప్రజలకు వైద్యం అందిస్తున్నామని, ఆరోగ్య మహిళా ద్వారా ప్రతి మంగళవారం కేవలం మహిళలకు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో కచ్చితంగా డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పంచాయతీ శాఖ, మైనింగ్ శాఖ, వ్యవసాయ శాఖ, సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, వివిధ శాఖలపై సమావేశంలో సమీక్షించారు. ఆయా శాఖలకు చెందిన జిల్లా అధికారులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, షాద్‌నగర్ శాసన సభ్యుడు ఈర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ కె.శశాంక, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు